తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

శుక్రవారం

11 సెప్టెంబర్ 2026

పేజీలు : 08




## కంకర గుంతల రహదారులు.. మలవిసర్జన మయం

గ్రామానికి వచ్చే భక్తులకు, పర్యాటకులకు స్వాగతం పలికేది రోడ్లా? లేక మృత్యుకూపాలా? అన్నట్లుంది ఇక్కడి పరిస్థితి. జుంటుపల్లికి వచ్చే ప్రధాన రహదారులు అన్నీ కంకర తేలి, పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తున్నాయి. ప్రయాణికులు ఎప్పుడు ఏ గుంతలో పడి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందోనని నిత్యం భయపడుతూ, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. దీనికి తోడు, గ్రామంలో సరైన పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో రహదారులన్నీ మలవిసర్జన మయంగా మారుతున్నాయి. సీతారామ చంద్రుల వారి ఆలయము ఉన్న గ్రామంలో, పర్యాటకులు వచ్చే ప్రాంతంలో ఈ తరహా అపరిశుభ్రత ఇక్కడి ప్రజల ఆరోగ్యానికే కాక, ఊరి గౌరవానికి కూడా పెద్ద మచ్చగా మారింది.

# ప్రమాదం అంచున జుంటుపల్లి

**ముఖ్యమంత్రి నియోజకవర్గానికి కూతవేటు దూరంలో ప్రగతి రోదన**

- ఆ గ్రామానికి వెళ్లాలంటేనే భయం
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే..
- వనరులు ఉన్నా అభివృద్ధికి నోచుకోని టూరిజం
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గ్రామాన్ని దత్తత తీసుకొని కాపాడాలి

**యాలాల, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :**

ఒకప్పుడు దొరల, దేశ్‌ముఖ్‌ల పాలనలో వైభవంతో ఒక వెలుగు వెలిగి, ఈ ప్రాంతంలోనే మంచి పేరు ప్రఖ్యాతులు గాంచిన ఆ చారిత్రక గ్రామం నేడు పాలకుల, స్థానిక నాయకుల ఘోర నిర్లక్ష్యానికి బలవుతుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ కు అత్యంత సమీపంలో, కూతవేటు దూరంలోనే ఉన్నప్పటికి, ఈ పల్లె మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది. చుట్టుపక్కల పదుల సంఖ్యలో ఉన్న గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉండి, బ్యాంకు సౌకర్యం లాంటి కీలక వసతులు ఇక్కడ ఉన్నప్పటికి, కనీస సౌకర్యాలు లేక ఈ గ్రామము వెనుకబడిపోతోంది. ఆధ్యాత్మికతకు నిలయమై, 'రెండవ భద్రాద్రి'గా భక్తుల గుండెల్లో కొలువైన మహోన్నత సీతారామచంద్రుల వారి ఆలయము ఉన్న వికారాబాద్ జిల్లా యాలాల మండలంలోని జుంటుపల్లి గ్రామం.. నేడు పాలకుల నిర్లక్ష్యపు నీడలో మసకబారిపోతోంది.

**ప్రకృతి ఒడిలో అద్భుత టూరిజం ప్రాంతం.. జుంటుపల్లి జలాశయం**

జుంటుపల్లి గ్రామానికి ప్రకృతి ఎన్నో అపారమైన సిరిసంపదలను, వనరులను ఇచ్చింది. చుట్టూ దట్టమైన, పచ్చని అడవి ప్రాంతము మధ్య ఈ గ్రామం కొలువై ఉంది. ఇక్కడి అడవి అందాలు, ప్రశాంత వాతావరణం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. దీనికి తోడు, గ్రామానికి ఆనుకుని ఉన్న జుంటుపల్లి ప్రాజెక్టు (జలాశయం) ఈ ప్రాంతానికే ఒక మకుటం. నిండుగా ప్రవహించే ఈ జలాశయం, చుట్టూ ఉన్న కొండలు, అడవి కలిసి ఈ ఊరిని ఒక అద్భుతమైన టూరిజం ప్రాంతంగా మార్చాయి. వీకెండ్‌లలో ప్రకృతిని ఆస్వాదించడం కోసం ఎంతో మంది పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. ఒకపక్క పచ్చని అడవి, మరోపక్క జలాశయం, ఇంకోవైపు ఆధ్యాత్మికతను పంచే 'రెండవ భద్రాద్రి' గా పేరుగాంచిన

లోపలి పేజిలో







## జీవనాధారమైన ప్రాజెక్టుకు గండీలు.. సర్వేలకే పరిమితమైన మరమ్మతులు

జుంటుపల్లి ప్రాజెక్టు కేవలం చూసి వెళ్లే టూరిజం ప్రాంతం మాత్రమే కాదు, చుట్టుపక్కల వేలాది మంది రైతుల జీవితాలకు అది కల్పవృక్షం. చుట్టుపక్కల గ్రామాలకు జీవనాధారమైన వరి పంటకు ఈ ప్రాజెక్టు ద్వారానే సాగునీరు అందుతోంది. పచ్చని వరి పొలాలతో కళకళలాడాల్సిన ఈ ప్రాంతంపై నేడు భయాందోళనలు అలుముకున్నాయి. ఈ కీలకమైన ప్రాజెక్టుకు గండీలు పడి తీవ్రమైన ప్రమాదం అంచున ఉంది. ఏదైనా ప్రమాదం జరిగితే చుట్టుపక్కల గ్రామాలు మునిగిపోయేలా, రైతుల జీవనాధారం దెబ్బతినేలా పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది.అధికారులు, పాలకులు వచ్చి చూసి పోవడం, కేవలం సర్వేలకే పరిమితం కావడం మినహా పూర్తి స్థాయి మరమ్మతులకు ఎందుకు నోచుకోవడం లేదు? వారి జీవనాధారమైన వరి పంటలు పాలకులకు అంత చులకనగా మారాయా? ప్రమాదం జరిగి సర్వస్వం కోల్పోయాక నిధులు ప్రకటిస్తారా? అని అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మట్టి గణపతిని పూజిద్దాం

**పర్యావరణాన్ని పరిరక్షిద్దాం : జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ వినాయక చవితికి ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ"మట్టి గణపతిని పూజిద్దాం... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశంతో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వినియోగాన్ని తగ్గించి, మట్టితో తయారు చేసిన గణనాథులను పూజించేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించవచ్చని కలెక్టర్ తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ప్రజలకు సూచించారు..



## అల్వాల్‌లో బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు

**అల్వాల్, సెప్టెంబర్ 10(జనంసాక్షి):** అల్వాల్ సర్కిల్ పరిధిలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గురు వారం తెల్లవారుజామున ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పలువురిని గృహనిర్బంధం చేయగా.. మరికొందరిని పోలీస్ స్టేషన్ల కు తరలించారు. రాజకీయ కార్యక్రమాలు, నిరసనల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న వారిలో నందికంటి శ్రీధర్, అనిల్ కిషోర్ గౌడ్, డోలి రమేశ్, మంద శోభన్‌బాబు, ఢిల్లీ పరమేశ్, జావిద్, నర్ల సురేశ్, వెంకట్, యెన్ను భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, అజయ్‌గౌడ్, గణేశ్‌గౌడ్, మణికంఠ, పవన్ తదితరులు ఉన్నారు. నేతల ఇళ్ల వద్ద పోలీసులు మోహరించడంతో ఉద్రిక్తత నెలకొంది. ముందస్తు అరెస్టులపై బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలను అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నాయి. మరోవైపు, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పోలీసుల సమాచారం ఇచ్చారు.



## మలేషియాలో నిర్మాణ రంగంలో ఉద్యోగావకాశాలు

- అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి
- మేడ్చల్ జిల్లా ఉపాధి, శిక్షణ అధికారి ఎం.రాధిక

లోపలి పేజిలో



## నీట్ లో మెడికల్ సీట్ సాధించిన విద్యార్థిని హర్షిత,కు అభినందనలు



**తలకొండపల్లి సెప్టెంబర్10(జనంసాక్షి):**కష్టాలు ఎదురైన లక్ష్యాన్ని వీడలేదు,పరీక్ష రద్దయిన ఆత్మవిశ్వాసం కోల్పోలేదు..తల్లి అండ,తండ్రి ప్రోత్సాహంతో పట్టుదలగా చదివి నీటిలో సత్తా చాటింది పెరుమండ్ల హర్షిత..తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పెరుమండ్ల రాజేందర్ జ్యోతి దంపతుల కుమార్తె పెరుమండ్ల హర్షిత నీట్ 2026 అర్హత ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంబిబిఎస్ లో సీటు సాధించింది.నిరుపేద కుటుంబం నుండి వచ్చి,కష్టపడి చదివి వైద్య విద్యలో సీటు సాధించడం పట్ల గ్రామంలో పెద్దలు,ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.తలకొండపల్లి మండలానికి చెందిన విద్యార్థిని వైద్య విద్యలో ప్రవేశం పొందడం మండలానికే గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.ఈ విషయం తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ నాయకులు శానమోని పాండు,బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు తిరుమణి రవి గౌడ్ ఆధ్వర్యంలో హర్షితను ఘనంగా శాలువాతో సన్మానించి అభినందించారు.భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి పేద ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాండు ప్రసాద్ ,తిరుమణి రవి గౌడ్,పెరుమాండ్ల రాజు,బాలకృష్ణ,శ్రీను, సిద్దయ్య, ప్రసాద్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు



**నిజాంపేట్ సెప్టెంబర్ 10 జనం సాక్షి:**తెలంగాణ ఉద్యమకారిని వీరనారి చాకలి చిట్యాల ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుకలు సిపిఎం పార్టీ బాచుపల్లి మండల కమిటీ సభ్యులు బాల వెంకటేశ్వరరావు అధ్యక్షతనప్రగతి నగర్ సుందరయ్య భవన్ లో ఘనంగా వర్ధంతి సభ నిర్వహించారు.సిపిఎం పార్టీ మహిళా నాయకురాలు రామాచిట్యాల ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు రోజా,ం. నాగమణి, అంజలి,ఏ.నాగమణి, రుప్పని, శ్యామ్, బాల పీర్, పి. స్వామి, పి.భాస్కర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి



**రంగారెడ్డి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సునీల్, వివిధ సంఘాల నాయకులు పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా పోరాటాలకు ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ 1985 సెప్టెంబర్ 10న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు.ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి కేశవ్ రామ్, రజక సంఘం ప్రెసిడెంట్ ఎం. అజయ్, కౌన్సిలర్ ఆంజనేయులు, బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేష్ యాదవ్, ఆదిభట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ నిరంజన్ రెడ్డితో పాటు పలువురు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మూసి కాలుష్య నివారణకే ప్రాధాన్యం ఇవ్వాలి

### ఇళ్లు కూల్చడం కాదు, నదిని పరిరక్షించడమే నిజమైన అభివృద్ధి



**ముషీరాబాద్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** మూసి నది అభివృద్ధి పేరుతో చేపడుతున్న చర్యల్లో ప్రజల జీవన హక్కులు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని మూసి జన ఆందోళన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద గల ధర్నా చౌక్ లో మూసి ప్రాజెక్టు నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, పర్యావరణవేత్తలు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, గత ప్రభుత్వంలో మూసి ప్రాజెక్టు చైర్మన్‌గా పనిచేసిన సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం మూసి నదిని శుభ్రపరిచే దిశగా చర్యలు చేపట్టగా, ప్రస్తుత ప్రభుత్వం మూసి పరివాహక ప్రాంతాన్ని రియల్ ఎస్టేట్ అభివృద్ధికి వినియోగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.విశ్రాంత శాస్త్రవేత్త, పర్యావరణవేత్త బాబూరావు మాట్లాడుతూ, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) లేకుండానే కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతులు ఇవ్వడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. పర్యావరణవేత్త దొంతి నరసింహారెడ్డి మాట్లాడుతూ, ప్రాజెక్టులో నది కాలుష్య నివారణ అంశాలకు తగిన ప్రాధాన్యం లేకపోవడాన్ని ప్రశ్నిస్తూ, మూసి అభివృద్ధి విషయంలో అన్ని ప్రభుత్వాలు విధ్వంసకర విధానాలను అనుసరిస్తున్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా మూసి జన ఆందోళన్ ఐదు ప్రధాన డిమాండ్లను వెల్లడించింది. సమగ్ర డీపీఆర్‌ను తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో విడుదల చేసి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని, స్వతంత్ర పర్యావరణ, సామాజిక ప్రభావ అంచనాలు పూర్తయ్యే వరకు భారీ నిర్మాణాలను నిలిపివేయాలని కోరింది. అలాగే పరిశ్రమల వ్యర్థాలు నదిలో కలవకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, మురుగునీటి శుద్ధి కేంద్రాలను పూర్తి సామర్థ్యంతో నిర్వహించాలని సూచించింది. వికారాబాద్ నుంచి వాడపల్లి వరకు మొత్తం మూసి పరీవాహక ప్రాంతాన్ని పర్యవేక్షించే ప్రత్యేక 'మూసి రివర్ బేసిన్ అథారిటీ'ని ఏర్పాటు చేయాలని, 1997 నుంచి మూసి పునరుద్ధరణ పేరుతో ఖర్చు చేసిన ప్రజాధనంపై పారదర్శక ప్రజా ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేసింది.

# బీఆర్ఎస్వీ నేతల అక్రమ అరెస్టులు

### బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు జగదీశ్వర్



**రంగారెడ్డి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల పెండింగ్ సమస్యలపై నిలదీస్తారన్న భయంతోనే బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. వారిని ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. అందులో భాగంగానే ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నియోజకవర్గం బీఆర్ఎస్వీ అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్, మున్సిపాలిటీ అధ్యక్షులు మడుపు శివ సాయి, రాష్ట్ర నాయకులు పి. రాజు కుమార్, మంచాల మండల అధ్యక్షులు బొట్టు ప్రవీణ్ నాయక్, బన్నీ గౌడ్, పి. తిరుమల్ రెడ్డి, ప్రసాద్ గౌడ్ తదితరులను పోలీసులు అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేయిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలనను తలపించేలా అర్ధరాత్రి నుండి పోలీసులను ఉపయోగించి నాయకులను గృహనిర్బంధాలు, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య హేలాపహ్యామమని విమర్శించారు. పరిపాలన చేతగాక ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతుకలను అణిచివేసే పిరికిపంద చర్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కల్పించాలని, పాఠశాలల ఎత్తివేతను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వాల అణచివేత చర్యలతో విద్యార్థుల సమస్యలపై పోరాటాన్ని ఆపలేమన్నారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన వీర వనితని చాకలి ఐలమ్మ

### సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య



**కాప్రా , సెప్టెంబర్ 10 (జనం సాక్షి ) :** భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన వీర వనితని చాకలి ఐలమ్మ అని సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. వీరనారి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా సిపిఐఎం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కమల నగర్ ఆఫీస్ నుంచి ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య హాజరై పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన వీర వనితని ఐలమ్మను కొనియాడారు తన భూమిలో విసునురి రామచంద్రారెడ్డి మనుషులు పంటను కోసుకుపోతూ ఉంటే వారికి ఎదురొడ్డి పోరాడిన వీర వనితని తర్వాత కాలంలో ఆంధ్ర మహాసభ సహకారంతో విసునూరి రామచంద్ర రెడ్డి మనుషులను తరిమి కొట్టి తన పంటను కాపాడుకుందని తెలిపారు తర్వాత కాలంలో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ సాయుధ పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు తెలంగాణ సాయుధ పోరాట సమయంలోనే దొడ్డి కొమరయ్య తొలి అమరుడయ్యాడని తెలిపారు తర్వాత కాలంలో మహిళల హక్కుల కోసం మహిళ పట్ల చూపుతున్న వివక్ష కోసం ఐలమ్మ పోరాటం చేసిందని తెలిపారు 1947 ఆగస్టులో భారతదేశం అంతటా స్వతంత్రం వచ్చిన తెలంగాణలో మాత్రం నిజాం పాలనలోనే ఉందని నిజాం పాలన దుర్మార్గాలకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం దాదాపు 5 సంవత్సరాల పాటు జరిగిందని ఈ పోరాటంలో 4,000 మంది పైగా పౌరులు అమరులయ్యారని లక్షలు ఎకరాలు పేదలకు పంచారని గుర్తు చేశారు సాయుధ పోరాటం తర్వాత తెలంగాణలో కమ్యూనిస్టులు బలపడుతున్న సందర్భంగా కేంద్రంలో ఉన్న నెహ్రూ పటేల్ సైన్యాన్ని పంపితే నిజాం సైన్యం ఎలాంటి పోరాటం చేయకుండా సందీ కుదుర్చుకుని లొంగిపోవడం జరిగిందని తెలిపారుఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి సత్యం కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి ఎర్ర అశోక్ ఎం వినోద పార్టీ సీనియర్ నాయకులు జి. యాదగిరి రావు, శ్రీమన్నారాయణ, జీ శ్రీనివాస్ రావు,పి గణేష్, సిహెచ్ ప్రసాదు , బి వి సత్యనారాయణ, శివనారాయణ,వెంకటాచారి, జెన్నీ,లీలా వతి ఎంఎస్ రావు, టీబీ చారి శివరామకృష్ణ బాబురావు, శశాంక్ పాల్గొన్నారు.

# రైతులకు ఉపయోగకరమైన నూతన ఎరువులు

### ఉత్పత్తి ని ఆవిష్కరణ చేసిన ఈటల రాజేందర్



**హయత్‌నగర్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి)**వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికతను ప్రోత్సహించే దిశగా ప్యూరిటీ కింగ్ ఆఫ్ కింగ్స్ ఎన్ పి కే 11-11-8 సస్పెన్షన్ ఫెర్టిలైజర్ నూతన ఉత్పత్తిని హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని గ్రీన్‌వుడ్ కాలనీలో ఆవిష్కరించారు. గ్రీన్‌వుడ్ కాలనీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కొలాబరేషన్ అండ్ ప్రొడక్ట్ లాంచ్ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తో కలిసి హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్యూరిటీ కింగ్ ఆఫ్ కింగ్స్ ఎన్ పి కే 11-11-8 సస్పెన్షన్ ఫెర్టిలైజర్‌ను అధికారికంగా ఆవిష్కరించారు.నిర్వాహకుల వివరాల ప్రకారం, ఈ నూతన ఎరువులో ఎన్ పి కే తో పాటు జింక్, బోరాన్ వంటి సూక్ష్మ పోషకాలను సమృద్ధిగా అందించే విధంగా ఉత్పత్తిని రూపొందించారు. పంటలకు అవసరమైన పోషకాలను అందించడంలో ఆధునిక సాంకేతికతతో రూపొందిన ఉత్పత్తులు రైతులకు మరింత ఉపయోగకరంగా ఉండే అవకాశం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.వ్యవసాయ రంగంలో పెరుగుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా నూతన ఉత్పత్తులు అందుబాటులోకి రావడం స్వాగతించదగ్గ పరిణామమని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ ఉత్పత్తి వ్యవసాయ రంగానికి, రైతులకు ప్రయోజనకరంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.అంతర్జాతీయ సహకారంతో వ్యవసాయ రంగంలో మరిన్ని నూతన ఉత్పత్తులు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు అందించడంతో పాటు వాటి వినియోగం, ప్రయోజనాలపై అవగాహన కల్పించడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ రంగానికి చెందిన పలువురు ప్రతినిధులు, కంపెనీ నిర్వాహకులు, సంబంధిత సిబ్బంది, స్థానిక ప్రముఖు పాల్గొన్నారు.

# స్పీకర్ పై ఎమ్మెల్సీల వ్యాఖ్యలు దురదృష్టకరం

### బిఆర్ఎస్ ఎమ్మెల్సీలను బర్తరఫ్ చేయాలని కందుకూరులో కాంగ్రెస్ నాయకుల ధర్నా



**కందుకూరు సెప్టెంబర్ 10 (జనం సాక్షి ):**తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలు అసభ్య పదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ కందుకూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ, ఐఎన్టీయూసీ,కార్మిక శాఖ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఐఎన్టీయూసీ మండల అధ్యక్షుడు గాదె కుమార్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీల తీరుపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ పదవిని, దళిత నాయకుడిని అవమానించిన సదరు ఎమ్మెల్సీలను వెంటనే వారి పదవుల నుంచి బర్తరఫ్ చేసి, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా టిపిసిసి జనరల్ సెక్రటరీ ఏనుగు జంగారెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో బిఆర్ఎస్ నాయకులు అలజడులు సృష్టిస్తూ, కుల అహంకారంతో దళితులపై అనుచితంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు.19వ శతాబ్దంలో దళితుల పట్ల ప్రదర్శించిన వివక్ష పూరిత వైఖరినే, 21వ శతాబ్దంలోనూ బిఆర్ఎస్ నాయకులు ఆచరిస్తున్నట్లుగా వారి వ్యవహారశైలి ఉందన్నారు. నేటి సమాజంలో దళిత వర్గాల నుంచి ఎంతో మంది మేధావులు, విద్యావంతులు, రాజకీయ నాయకులు ఎదిగారని.. కులమతాలకు అతీతంగా అందరూ ఐక్యంగా ఉన్నప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని స్పష్టం చేశారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు దళితులపై దాడులు, అనుచిత వ్యాఖ్యలు మానాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు సబితా యుగంధర్ రెడ్డి, సుమలత కృష్ణ, మహిళా అధ్యక్షురాలు అందుగుల ప్రభావతి,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, వరికుప్పల బాబు, అందుగుల సత్యనారాయణ, మాజీ ఎస్ సి సెల్ అధ్యక్షులు కత్తుల వెంకటేష్, పాపగళ్ల రవీందర్, యుగేందర్ గౌడ్, అంకగళ్ళ దర్శన్, చిర్ర సాయిలు, ఎగ్గిడి జగదీశ్,బుక్క పాండు రంగారెడ్డి, ఎగ్గిడి కృష్ణ, పేరుమళ్ళ శేఖర్, పాశం శ్రీనివాస్, చౌలపల్లి కృష్ణ, మద్దెల శ్రీశైలం, మంద మహేష్, నర్సింహా, బండ వేణు, గోపాల్, గాండ్ల నవీన్, రాజశేఖర్ రెడ్డి, పాముల కృష్ణ, బండ రాజు, మంద సాయిలు, జంగయ్య, ఉదయ్ కిరణ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్బిఐ బ్యాంకు అంటే భయపడుతున్న ఖాతాదారులు

### సిబ్బంది కొరత..చిన్నపాటి పని కోసం వస్తే రోజుల తరబడి తిప్పుతున్న వైనం



**బొంరాస్ పేట,సెప్టెంబర్ 10 ( జనం సాక్షి):**మండల కేంద్రంలోని ఎస్బిఐ బ్యాంకులో పని అంటే భయపడుతూ హడలెత్తే పరిస్థితులు ఖాతాదారులు,రైతులు పడుతున్నారు.చిన్నపాటి పని కోసం బ్యాంకుకు వస్తే రోజుల తరబడి తిప్పుతున్నారని,అన్ని పనులు మానుకొని సైతం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు తలెత్యాయని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కొరత.. ఆపై ఖాతాదారుల పట్ల దురుసు ప్రవర్తన నిరక్షరాస్యులు బ్యాంకులో సమస్య ఉందని వస్తే బ్యాంకు సిబ్బంది సేవలు అందించాల్సిపోయి దురుసుగా ప్రవర్తిస్తున్నారనే వాదన వినిపిస్తోంది.మేనేజరు దగ్గర క్యాబిన్ లోకి వెళ్లి సమస్య చెప్పుకుందాం అంటే అటువైపు వెళ్లకుండా లాక్ చేసి బయటనే గంటల తరబడి నిలబెడుతున్నారని పలువురు ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రైతులు తీసుకున్న బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించకపోవడంతో వారి జనరల్ ఖాతాలను లాక్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు.ఈకేవైసీ,కేవైసీ,రుణాలకు సంబంధించిన సేవలను పొందేందుకు ఉదయం బ్యాంకు తెరవకముందు నుండే పడిగాపులు కాస్తున్న సాయంత్రం అయినా పనులు కావడం లేదని,సర్వర్ డౌన్,లంచ్ బ్రేక్ పేరుతో ఇబ్బందులు పడుతున్నామని బ్యాంకుకు రావాలంటే భయమేస్తుందని పలువురు ఖాతాదారులు వాపోతున్నారు.ఎస్బిఐ బ్యాంకులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు ఖాతాదారులు బ్యాంకు మేనేజర్ రజనీకాంత్ కు వినతిపత్రం అందజేశారు.కొత్తగా బ్యాంకు రుణం కావాలంటే డిపాజిట్ బీమా రూపంలో తిరిగి బ్యాంకుకు తీసుకున్న అప్పులో నుండి డబ్బులు చెల్లించాల్సి వస్తుందని,రుణం మంజూరుకు బీమా విషయంపై బ్యాంకు అధికారులు స్పష్టత ఇవ్వాలని బ్యాంకు అధికారులను ఖాతాదారులు కోరారు.బ్యాంకులో ప్రతి ఉద్యోగికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని, బ్యాంకుకు వచ్చే ఖాతాదారుల పట్ల మర్యాదగా బాధ్యతాయుతంగా మాట్లాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాబయ్య నాయుడు, జగదీశ్వర్, కృష్ణ, అర్జునయ్య, కృష్ణయ్య, అంజలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మా ఆత్మగౌరవం కోసం పోరాటం చేస్తాం

### యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కృష్ణంరాజు



**కొడంగల్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తే సహించేది లేదని, దళితుల హక్కులు, ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాటం చేస్తామని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కృష్ణంరాజు అన్నారు.దళితులు నడిచిన నేలను పసుపు నీటితో శుద్ధి చేయడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. దళితులను అంటరానివారిగా భావిస్తున్నారా అని నిలదీశారు. భారతదేశ చరిత్రలో దళితుల పాత్ర ఎంతో గొప్పదని, జాంబవంతుడి వంటి మహనీయుల చరిత్రను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.దళితుల పట్ల వివక్షను ప్రోత్సహించే చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. దళితుల ఆత్మగౌరవం కోసం కొడంగల్ నుంచే లక్ష మందితో యువ గర్జనకు శ్రీకారం చుడతామని, పెద్ద సంఖ్యలో దళిత యువతతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

# ఐలమ్మ ధైర్యం, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకం

### బెలిదే రమేష్‌గుప్తా



**కీసర, సెప్టెంబర్ 10 (జనంసాక్షి)**వీరనారి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బెలిదే రమేష్‌గుప్తా పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐలమ్మ ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.

# చేవెళ్లలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి

### వీరనారి పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం



**చేవెళ్ల, సెప్టెంబరు 10 (జనంసాక్షి)** తెలంగాణ సాయుధ పోరాట ధీర వనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తితోనే మలి విడత తెలంగాణ ప్రత్యేక ఉద్యమం సాగి విజయం సాధించిందని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, చేవెళ్ల మండల రజక సంఘం అధ్యక్షుడు వై.శివకుమార్ అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల నాయకులు హాజరై ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బండారి శైలజాఆగి రెడ్డి, కరికె మీనాక్షి, శ్రీనివాస్, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బండారి ఆగిరెడ్డి, రాములు, బీజేపీ నాయకులు శ్రీనివాస్, అశోక్, యాదగిరి, పాగా వెంకటేశ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పెంజర్ల అనంత్ రెడ్డి, మల్లా రెడ్డి, నత్తి కృష్ణారెడ్డి, మాణిక్యం, బి.నర్సింలు, రాంప్రసాద్, కుమార్, భాస్కర్, ఎదిరె రాములు, ఎం. రాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి అల్లీ దేవేందర్, చేవెళ్ల రజక సంఘం మాజీ అధ్యక్షుడు సీహెచ్. శ్రీనివాస్, జిల్లా రజక జేఏసీ చైర్మన్ దేవుని శర్వలింగం, రజక సంఘం ఉమ్మడి జిల్లా డైరెక్టర్ జె.మల్లేశ్, జిల్లా రజక సంఘం నాయకులు వెంకటయ్య, రాజేశ్, శ్రీనివాస్, క్రిష్ణా, ప్రశాంత్, అనంతయ్య, పాండు, వెంకటేశ్, రాజు, మాజీ వార్డు సభ్యులు శ్రీనివాస్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చిన్నారి కన్మణి జన్మదిన వేడుకలు

### కూతురు పుట్టిన రోజును సేవా కార్యక్రమలతో జరుపుకున్న బొల్లి దంపతులు



**తలకొండపల్లి సెప్టెంబర్ 10(జనంసాక్షి):**తలకొండపల్లి మండలంలోని గట్టుఇప్పలపల్లి గ్రామానికి చెందిన బొల్లి మాధవి రమేష్ దంపతులు తమ కూతురు బొల్లి కన్మణి పుట్టిన రోజును బుధవారం ఘనంగా జరుపుకున్నారు.తమ బిడ్డకు చిన్నప్పటి నుంచే సేవా గుణం అలవడాలన్న ఉద్దేశ్యంతో కల్వకుర్తిలోని వృద్ధాశ్రమాన్ని సందర్శించారు.అక్కడ బస చేస్తున్న వృద్ధులకు 50 కిలోల బియ్యం,పండ్లు అందజేసి,వారితో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు.వృద్ధుల ఆశీస్సులు తీసుకున్నారు.అనంతరం విద్యానగర్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు పలకలు,నోట్ బుక్స్,చార్ట్స్ పంపిణీ చేశారు.పిల్లల చదువుకు తమ వంతు సహాయం చేయడం ఎంతో సంతోషంగా ఉందని దంపతులు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఆంజనేయులు,వృద్ధాశ్రమ సిబ్బంది,పాఠశాల ఉపాధ్యాయురాలు కవిత,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## జీవనోపాధి అవకాశాలు

### సమర్థవంతంగా అమలు చేయాలి



**కొడంగల్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** కొడంగల్ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో టీజీఐఎల్పి పైలెట్ ప్రోగ్రాం కింద వివిధ జీవనోపాధి కార్యక్రమాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన కోచ్‌లు,యాక్టివిస్టులు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏపీఎం పి.గోపాల్ మాట్లాడుతూ గ్రామాల వారీగా అమలు చేస్తున్న జీవనోపాధి కార్యక్రమాల పురోగతి, లబ్ధిదారులకు అందుతున్న సహకారం, కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. పైలెట్ ప్రోగ్రాం ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో టీజీఐఎల్పిజిల్లా కోఆర్డినేటర్ రవికుమార్, మండల కోఆర్డినేటర్ భూపతి, మండలంలోని వివిధ గ్రామాల యాక్టివిస్టులు పాల్గొన్నారు.

## అల్వాల్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి



**అల్వాల్, సెప్టెంబర్ 10(జనంసాక్షి):**అల్వాల్‌లో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని మాజీ కార్పొరేషన్ సభ్యురాలు గొట్టిముక్కల జ్యోతి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చేసిన పోరాటం, ప్రదర్శించిన ధైర్యసాహసాలను పలువురు కొనియాడారు. ఆమె ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కార్యక్రమంలో శారద, సులోచన, నర్సమ్మ, అనసూయ, జయమ్మ, పద్మ, భవాని, శ్రీకాంత్, నవీన్, శ్రీనివాస్, గురుపాదం, జగన్నాథం, వంశీ, హరి, సుదర్శన్, మహేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

**తలకొండపల్లి సెప్టెంబర్10 (జనంసాక్షి):**చంద్రధన గ్రామ సమగ్ర అభివృద్దే లక్ష్యంగా గ్రామ సర్పంచ్ సొల్లు రంగమ్మ,మాజీ ఉపసర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామానికి అవసరమైన పలు అభివృద్ధి పనుల కోసం కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి,ని వారి క్యాంప్ ఆఫీసులో కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా చంద్రధన గ్రామంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.గ్రామంలో ముఖ్యంగా సీసీ రోడ్ల నిర్మాణం,అండర్ డ్రైనేజీల నిర్మాణం,అదేవిధంగా ప్రధాన రహదారి నల్లచెరువు వద్ద కల్వర్ట్ నిర్మాణ పనులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి,ప్రజల అవసరాలను ప్రాధాన్యతగా తీసుకుని ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టేలా సహకరించాలని సర్పంచ్ సొల్లు రంగమ్మ కోరారు.చంద్రధన గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పన,రహదారుల అభివృద్ధి,పారిశుధ్యం,ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా గ్రామ పాలకవర్గం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గ్రామ అభివృద్ధికి పార్టీలకతీతంగా నిధులు కేటాయించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో



గ్రామ ఉప సర్పంచ్ ఎన్నెడ్ల రవీందర్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ సొల్లు సుధాకర్,వార్డు సభ్యులు బేగరి ఆలివేలు చెన్నయ్య,మసిలి పార్వతమ్మ వెంకటయ్య,ఓర్సు రాజు,ఈటమోని అజయ్ యాదవ్,ఓర్సు బాల్ రాజ్,తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

### పడకల్ సర్పంచ్ దోకురి సునీత ప్రభాకర్ రెడ్డి

**తలకొండపల్లి సెప్టెంబర్ 10 (జనంసాక్షి):**పేద ప్రజల అభ్యున్నతి కొరకు నిరంతరం దేశంలో కానీ రాష్ట్రంలో కానీ పనిచేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పడకల్ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అన్నారు.రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో గురువారం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు మేలు జరుగుతుందన్నారు,ప్రభుత్వ పథకాలు మరియు సేవలు ప్రజలకు మరింత వేగంగా,పారదర్శకంగా అందించేందుకు ఈ స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.తమకు ఇంతగానో ఉపయోగపడే స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో




ఉప సర్పంచ్ రాఘవేందర్ గౌడ్,గ్రామ సెక్రెటరీ,జిపిఓ,డీలర్ లు,వార్డు సభ్యులు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్‌లో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి

**హయత్‌నగర్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి)**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరనారి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని హయత్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. సీపీఐ హయత్‌నగర్ మండల కన్వీనర్ అంబల రాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ సామిడి శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు, గడీల దొరల అకృత్యాలకు వ్యతిరేకంగా ఎర్రజెండా అండతో చాకలి ఐలమ్మ సాగించిన వీరోచిత పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. "నా భూమిలో పండిన పంట నాదే" అంటూ భూస్వామ్య, దోపిడీ శక్తులను ఎదిరించిన ఐలమ్మ ధైర్యం, తెగువ నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. పీడిత ప్రజల హక్కుల కోసం, శ్రామిక వర్గాల విముక్తి కోసం కమ్యూనిస్టులుగా రాజీలేని పోరాటాలు కొనసాగించడమే వీరనారి చాకలి ఐలమ్మకు మనం అర్పించే ఘనమైన నివాళి



అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీకేఎమ్ జిల్లా నాయకులు రమేష్, సౌజన్య, సామెల్, ఏఐటీయూసీ మండల నాయకులు ఉపేందర్, శేఖర్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకురాలు సుమతి తదితరులతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజా ఐక్యతను కాపాడాలి

### సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. చంద్రమోహన్

**హయత్ నగర్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి)**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సంస్మరణ సభను చింతలకుంటలో నిర్వహించారు. ఈ సభకు సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ కీలక పాత్ర పోషించారని అన్నారు. జమీందారీ, జాగీర్దారీ, భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పేద ప్రజల తరఫున ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా నిజాం నిరంకుశ పాలనకు, జమీందారులు, జాగీర్దారుల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించారని తెలిపారు. నాటి భూస్వామ్య శక్తులు పేద ప్రజలు, వృత్తిదారులతో వెట్టిచాకిరి చేయించుకునేవారని, దీనికి వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో తెలంగాణలో ప్రజా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిందన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం హయత్‌నగర్ సర్కిల్ నాయకులు



చింతపల్లి కృష్ణయ్య, ముషం నరహరి, నాయుని శ్రీనివాస్, బూరెల్ల భాస్కర్, చెన్నారం మల్లేశం, రాధ, డీవైఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి రమావత్ అజినాయక్, మన్యం రాధమ్మ, లింగస్వామి, కిరణ్, దండు అంజమ్మ, కలమ్మ, లాట్ల లక్ష్మణ్, యాదయ్య, కొండపల్లి చంద్రమౌళి, పి. జయమ్మ, ప్రేమలత, కే. అంజమ్మ, లక్ష్మి, కవిత, నరసమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# చందిప్పలో అర్ధరాత్రి చోరీ కలకలం - వృద్ధురాలిపై కత్తితో దాడి

**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):**రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం చందిప్ప గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోరీ ఘటన తీవ్ర కలకలం రేపింది.గ్రామానికి చెందిన చాకలి రుక్కమ్మ (80) అర్ధరాత్రి మూత్ర విసర్జనకు లేవగా, ఇంట్లోకి చొరబడిన దుండగుడు ఆమె మెడలోని బంగారు ఆభరణాలను తెంపుకునేందుకు యత్నించాడు. వృద్ధురాలు దొంగ... దొంగ... అంటూ కేకలు వేసి ప్రతిఘటించడంతో, ఆగ్రహించిన దుండగుడు కత్తితో ఆమెపై దాడి చేసి పారిపోయాడు. నలుగురు దొంగలు ఉన్నట్లు బాధిత వృద్ధురాలు తెలిపింది.గాయపడిన వృద్ధురాలిని కుటుంబ సభ్యులు వెంటనే శంకర్‌పల్లిలోని ప్రాణ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నలుగురు దుండగులు గ్రామంలోని మరకత శివాలయం వైపు వెళ్లి, అటు నుంచి తిరిగి వస్తుండగా నిద్రలేచిన వృద్ధురాలు "ఎవడ్రా ఇక్కడ ఏం చేస్తున్నావ్" అంటూ అరవడంతో దాడి చేసి పారిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు .సమాచారం అందుకున్న శంకర్‌పల్లి పోలీసులు గురువారం తెల్లవారుజామున గ్రామాన్ని సందర్శించారు. క్లూస్ టీంను రప్పించి వృద్ధురాలి ఇంటి పరిసరాలను, శివాలయం పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వృద్ధురాలి ఇంటి ముందు రక్తపు చుక్కలు కనిపించాయి.ఈ ఘటనతో చందిప్ప గ్రామంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# దళిత స్పీకర్‌ను అవమానించిన బిఆర్ఎస్ నాయకులకు ప్రజా క్షేత్రంలో బుద్ధి చెబుతాం

### మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్

**శామీర్ పేట్ , సెప్టెంబర్ 10(జనం సాక్షి )**తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ నేతలు తాత మధు, నవీన్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం శామీర్‌పేట్ లోని ఎన్‌పీజీ వెంచర్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదని, యావత్ దళిత సమాజ ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని మండిపడ్డారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాత మధు, నవీన్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులను అవమానించేలా పసుపు నీళ్లు చల్లిన ఘటనను కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. దళితులు నడిచిన రోడ్డును పసుపు నీళ్లతో శుద్ధి చేసే మనస్తత్వం ఏ స్థాయిలో ఉందో ప్రజలు గమనించారన్నారు.ఇప్పుడు అదే అహంకారంతో దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు అంటూ బీఆర్ఎస్ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దొరల అహంకారాన్ని, ఆధిపత్య రాజకీయాలను ఇకనైనా విడిచిపెట్టాలని కేసీఆర్‌కు కాంగ్రెస్ నాయకులు సూచించారు. మీ ఫామ్‌హౌస్‌లలో అన్ని వర్గాల ప్రజలు పనిచేస్తున్నారు. అక్కడ కులం కనిపించదా..? కానీ దళితుడు ఉన్నత స్థానంలో ఉంటే మాత్రం ఎందుకు అవమానిస్తు న్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో దళితులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోందని నాయకులు అన్నారు. దళితుల ఆత్మగౌరవానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. స్పీకర్ పదవిని, రాజ్యాంగబద్ధమైన సంస్థలను గౌర వించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని పేర్కొంటూ, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసే హక్కు ఎవరికీ లేదని, ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ తగిన రీతిలో సమాధానం చెబుతుందని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు దళితుల ఆగ్రహం ఏమిటో ప్రజలు ఓటు రూపంలో చూపిస్తారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే రాజకీయాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాల్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కృష్ణా రెడ్డి, సెక్రటరీ హరిబాబు, సత్యనారాయణ జిల్లా అధికార ప్రతినిధి, శ్రీకాంత్ కాంగ్రెస్ నాయకులు, జిల్లా కార్యదర్శి నవీన్ రెడ్డి, బీపీటీ రాజు జనరల్ సెక్రటరీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో వినాయక చవితి జరుపుకోవాలి

### ప్రజలకు అసౌకర్యం కలగకడా చూడాలి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 11 (జనం సాక్షి):**జిల్లా లో వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు గణేష్ నవరాత్రి ఉత్సవ ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ స్నేహ మెహర, అదనపు కలెక్టర్ వెంకటాచారి అడిషనల్ ఎస్ పి లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ఈ నెల 14న వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఏర్పాట్లు చేయాలని, వినాయకుల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాపులు సిద్ధం చేసుకోవాలని, అవసరమైన రూట్లలో రోడ్ల మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని తెలిపారు. వినాయక చవితి నిమజ్జనానికి చెరువుల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఫస్ట్ ఎయిడ్ కిట్లను మెడికల్ ఆఫీసర్, సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేసిఅందుబాటులో ఉంచాలన్నారు. . చెరువుల దగ్గర బరికేడ్స్ మరియు గజ ఈ తగాళ్ల ను ఏర్పాటు చేయాలనీ, ఉత్సవ కమిటీ సభ్యులు గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఘనంగా పండగ వాతావరణంలో జరుపుకునేందుకు సహాయ సహకారాలు అందివ్వాలని తెలిపారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహర మాట్లాడుతూ... జిల్లా లో గణేష్ నిమజ్జనం రోజు ఎట్టి పరిస్థితుల్లో డి జే కు పరిమిషన్ లేదని,ప్రశాంత వాతావరణం లో పండుగ జరుపుకోవాలని అన్నారు. ఉత్సవ కమిటీ, పోలీస్ వారితో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు.గణేష్ పండుగను శాంతియుతంగా జరుపుకునేందుకు విగ్రహాన్ని పెట్టుకునే ప్రతి ఒక్కరు గణేష్ వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకునే విధంగా ఉత్సవ కమిటీ సభ్యులు చూడాలని అన్నారు. ఆన్లైన్లో నమోదు చేసిన వివరాలు బట్టి పోలీసు బందోబస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేయడం జరుగుతుందన్నారు. రాత్రి సమయంలో మండపాల వద్ద వాలంటీర్లు ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. గణేష్ మండపాలు రోడ్లను బ్లాక్ చేసి పెట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయి కాబట్టి రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉత్సవ కమిటీ హిందూ పద్ధతి ప్రకారం గణేష్ ఉత్సవాలకు భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు, గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులు తమ సూచనలు, సలహాలు తెలియ జేశారు.సమావేశం లోఅడిషనల్ ఎస్ పి రాజేష్ మినా,ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు, డి ఆర్ ఓ స్వర్ణలత, వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ ఉత్సవ కమిటీల సభ్యులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు , తదితరులు పాల్గొన్నారు.




# స్పీకర్ తో ఉద్యోగ సంఘాల నేతల భేటీ

### దసరా లోపు పీఆర్సీ ప్రకటించాలని విజ్ఞప్తి



**ముషీరాబాద్ సెప్టెంబర్ 10 జనం సాక్షి:**అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో ఉద్యోగుల సంఘాల నేతలు భేటీ అయ్యారు.ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో స్పీకర్ తో భేటీ అయ్యి పీఆర్సీ, డీఏలతో పాటు పలు సమస్యలపై చర్చించారు. ఈ ఏడాది దసరా లోపు పీఆర్సీ ప్రకటించాలని ఉద్యోగ సంఘాల నేతలు స్పీకర్ కు విజ్ఞప్తి చేశారు. మూడు డీఏలు ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటించాలని, సీపీఎస్ విధానం రద్దు పరచడానికి కమిటీ వేయాలని, 01-09-2004 కన్నా ముందు నోటిఫికేషన్ విడుదలై తదుపరి నియామకం పొందిన వారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాదిరిగా పాత పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ బిల్లులు నెలకు రెండు వేల కోట్లు చెల్లించాలని రిక్వెస్ట్ చేశారు. ఈహెచ్ఎస్ స్ట్రీమ్ లైన్ చేయాలని కోరారు. ఉద్యోగ సంఘాల డిమాండ్లపై స్పీకర్ ప్రసాద్ కుమార్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పీకర్ ప్రసాద్ కుమార్ హామీ ఇచ్చారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ తో భేటీ అయిన వారిలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాస రావు, అడిషనల్ సెక్రటరీ జనరల్ దామోదర్ రెడ్డి, జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ డాక్టర్ ముజీబ్, కో-చైర్మన్లు సదానంద గౌడ్, బిక్షపతి గౌడ్, శ్యామ్, జేఏసీ సెక్రటరీ వెంకట్ ఉన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

**ఎల్బీనగర్ సెప్టెంబర్ 10 (జనం సాక్షి):**చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా చింతలకుంట చౌరస్తాలోని ఐలమ్మ విగ్రహానికి బాత రాజు నరసింహ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించి పూలమాలలు వేసినారు కార్యక్రమాన్నీ ఉద్దేశించి వారు మాట్లాడుతూ భూమి కోసం,భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం దొరల అహంకారాన్ని ఎదురించిన వీరమాత చిట్యాల చాకలి ఐలమ్మ,నైజాం రజాకార్ల దౌర్జన్యాలపై, జమీందార్ల అన్యాయాలపై గర్జించిన వీర వనిత తెలంగాణ విప్లవ పోరాట బావుటా చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా వారి స్ఫూర్తికి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో జూపల్లి అంజయ్య చంద్రయ్య ఘర్ష జగన్ కృష్ణయ్య వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి ఘన నివాళి



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి )**తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్ చింతలకుంటలోని ఆమె విగ్రహానికి కొత్తపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మంచి రాజేష్‌కుమార్, సీనియర్ నాయకుడు వజీర్‌కుమార్ గౌడ్, డివిజన్ కార్యదర్శి సట్టు చంద్రశేఖర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ఆశయాలు, ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవి, నిరంజన్, శ్రీనివాస్, సాయి, మహేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలేవి?

### ఇష్టారాజ్యంగా నిర్మాణాలు నిబంధనలకు తూట్లు.. మొద్దు నిద్రలో అధికారులు



**కాప్రా, సెప్టెంబర్ 10 (జనం సాక్షి ) :** కాప్రా సర్కిల్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా భారీ అంతస్తు నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ దళారులకు సహకరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న సదరు అక్రమ నిర్మాణంపై ప్రశ్నించినందుకు తమపై బెదిరింపులకు పాల్పడ్డారని స్థానికులు తెలిపారు. సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వివరిస్తున్నారని ఆరోపించారు. ఇట్టి సమస్యను పలుమార్లు సంబంధిత అధికారులకు పిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణం పై చర్య తీసుకోవాలని, లేనియెడల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్థానికులు, కాలని వాసులు హెచ్చరిస్తున్నారు.

## తాండూర్ లో బీఆర్ఎస్వీ నేతల ప్రివెంటివ్ అరెస్టు

### బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు



**తాండూరు సెప్టెంబర్ 10(జనంసాక్షి)** అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో తాండూర్ లో పోలీసులు నిర్బంధ చర్యలకు పాల్పడ్డారని బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా గురువారం పోలీసులు నన్ను ప్రివెంటివ్ అరెస్టు చేయడం జరిగింది. మా నాయకుని చావు కోరిన కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకరయ్యను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయాలి. తెలంగాణ నాలుగున్నర కోట్ల ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ముందుగానే బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ ప్రివెంటివ్ అరెస్టులు చేయడం ఈ ప్రభుత్వానికి సిగ్గుచేటు. ప్రజాస్వామ్యంలో ప్రజల తరఫున ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదు. అక్రమ నిర్బంధాలతో మా పోరాటాన్ని ఆపలేరు. అణచివేతలు ఎంత పెరిగినా ప్రజల తరఫున మా పోరాటం ఆగదు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడే వరకు మా ఉద్యమం కొనసాగుతూనే ఉంటుంది" అని దత్తాత్రేయ రావు అన్నారు.

## రామంతాపూర్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

### ఎంపీఆర్ పరమేశ్వర్ రెడ్డి



**రామంతాపూర్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రామంతాపూర్ రజక సంఘం అధ్యక్షుడు దానయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డుపల్లి రవి, ప్రధాన కార్యదర్శి జిత్తు, బిడ్డుపల్లి ప్రసాద్, శ్రీనివాస్, సత్యనారాయణ, భీమేష్, అరుణ్ సాయి, బాల్ రాజ్, చిన్న శంకర్, బుయిషాపతి తదితరులు పాల్గొన్నారు.కాంగ్రెస్ నాయకులు ఆగిరెడ్డి, సుధాకర్ రెడ్డి, తౌఫిక్, జలీల్ పాషా, ఉపేందర్ రెడ్డి, అకరపు సంజీవ, మాలు నాయక్, చింటు సలీం, సంధ్యారాణి, మేంగా శోభ, అంబిక, శ్రీలత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తాం

### ఆలయ కమిటీ చైర్మన్లుగా వరప్రసాద్ గౌడ్, రాములు



**పెద్దేముల్ సెప్టెంబర్ 10(జనంసాక్షి)**మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలోని శ్రీ హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ గా వరప్రసాద్ గౌడ్, డైరెక్టర్లుగా ఆర్.నర్సింలు, వడ్ల రాములు, విజయ్ కుమార్, అనితలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీ గోపాలకృష్ణ గోపాలకృష్ణ ఆలయ కమిటీ చైర్మన్ గా ముదిని రాములు, డైరెక్టర్లుగా రాజ వర్ధన్ రెడ్డి, సి.నారాయణరెడ్డి, తలారి రాములు, ఎన్గూరి లక్ష్మిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ ప్రణీత్, ఈవో ప్రవీణ్ కుమార్ కలిసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్లు వరప్రసాద్ గౌడ్, రాములు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో ఆలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. తమకు అవకాశం కల్పించిన మనోహర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, వార్డు సభ్యుడు నర్సింలు, పూజారి ప్రశాంత్, ఎండోమెంట్ శాఖ సిబ్బంది శాంతు, గ్రామస్తులు తాడి అంజయ్య, చాపల వెంకటయ్య, సంగెం చంద్రప్ప, హర్షవర్ధన్ రెడ్డి, టిల్లు, కుమ్మరి నర్సింహులు, బంటారం భీమ్లు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ధైర్య పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

### తాండూర్ నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్



**తాండూరు సెప్టెంబర్ 10(జనంసాక్షి)**చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు, తాండూర్ నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, అన్యాయానికి ఎదురు నిలిచి ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆమె పోరాట చరిత్రను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షులు రజక కృష్ణ, వడ్డెర సమాజం జిల్లా అధ్యక్షులు వడ్డే సత్యనారాయణ, నాయి బ్రాహ్మణ సమాజం తాండూర్ అధ్యక్షులు పరమేష్ నాయి, దొమ్మ కృష్ణ, కేశవరావుతో పాటు బీసీ సంఘం నాయకులు జోసెఫ్, రాము ముదిరాజ్, పరమేష్, తాండ్ర నరేష్, మంతటి రాజు, శ్రీనివాస్, రఘువీర్, నరేందర్, విశ్వేశ్వర్, బిచ్చప్ప, బాబు రాజ్, నవీన్, దత్తాత్రేయ, చిన్న, సాయి, వివేక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల ద్వారా చిన్నపిల్లలకు నాణ్యమైన విద్య,పౌష్టికాహారం

### మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్



**బొంరాస్ పేట, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** మండల పరిధిలోని ఏర్పుమళ్ళ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం రాత్రి ఆగా ఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నపిల్లల అభివృద్ధి,సానుకూల పెంపకంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా కళాజాత ప్రదర్శన ద్వారా పాటల రూపంలో చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము అంగన్వాడీల ద్వారా చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే కాక, ప్రాథమిక స్థాయిలో విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం, మధ్యాహ్నం మధ్యాహ్నం భోజనం అందించి మెరుగైన విద్యా ప్రమాణాలను అందజేస్తుందన్నారు. బేటి బచావో,బేటి పడావో వంటి కార్యక్రమాలను ప్రభుత్వం తీసుకు వచ్చిందని, సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా ఆడబిడ్డలు 21 సంవత్సరాలు నిండి పెళ్లీడుకు వచ్చేనాటికి ప్రతినెల పొదుపు చేసుకునేందుకు అవకాశం ఉందని,ప్రతి ఒక్కరూ చిన్నారులను చదివించాలని ఈసిడి మమత అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బందెయ్య,వార్డు సభ్యులు శ్రీనివాస్,నర్సింలు, వెంకటయ్య, దేవమ్మ, అంగన్వాడి టీచర్లు గౌసియా బేగం, సుజాత, చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

### సీపీఐ రాష్ట్ర నాయకులు కావలి నరసింహ



**రంగారెడ్డి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం ఇబ్రహీంపట్నంలో సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు కావలి నరసింహ మాట్లాడుతూ.. భూస్వామ్య, పెత్తందారీ దోపిడీకి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని కొనియాడారు. పేదలు, రైతులు, కూలీల హక్కుల పరిరక్షణ కోసం ఆమె చూపిన సాహసం, పోరాట స్ఫూర్తిని నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో సామాజిక న్యాయం, సమానత్వం సాధించడానికి ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు నీలమ్మ, సీపీఐ మండల కార్యదర్శి కావలి సురేష్, మున్సిపల్ సీపీఐ కార్యదర్శి బండి నరసింహ, పోల్కంపల్లి గ్రామ కార్యదర్శి గుండ్ల శీను తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మలేషియాలో నిర్మాణ రంగంలో ఉద్యోగావకాశాలు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) మలేషియాలో నిర్మాణ రంగంలో ఉద్యోగాలు పొందేందుకు అర్హత, ఆసక్తి ఉన్న తెలంగాణ నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధి, శిక్షణ అధికారి ఎం.రాధిక తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టిఓఎంసిఓఎం) ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ పర్యవేక్షణలో ఆమోదిత రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా ఈ విదేశీ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. మలేషియాలో నిర్మాణ రంగానికి సంబంధించి హెవీ వర్కర్, పైప్ వెల్డర్, స్టీల్ వర్క్, కాంక్రీట్, ఎక్స్‌కవేటర్, బ్యాక్‌హో ఆపరేటర్ పోస్టులు అందుబాటులో ఉన్నాయని రాధిక తెలిపారు. హెవీ వర్కర్ పోస్టులకు కష్టతరమైన, ప్రమాదకరమైన పనులను నిర్వహించే సామర్థ్యం కలిగి ఉండాలని, పైప్ వెల్డర్ పోస్టుకు సంబంధిత వెల్డింగ్ పనుల్లో నైపుణ్యం అవసరమని పేర్కొన్నారు. స్టీల్ వర్క్, కాంక్రీట్ విభాగంలో రీబార్లను కట్ చేయడం, బెండ్ చేయడం, ఫిక్స్ చేయడం వంటి పనులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎక్స్‌కవేటర్, బ్యాక్‌హో ఆపరేటర్ పోస్టులకు తవ్వకాలు, ట్రెంచింగ్, భూకార్యకలాపాల్లో అనుభవం ఉండాలని వివరించారు.

**అర్హతలు :** 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా లేదా సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని రాధిక తెలిపారు. ఫ్రెషర్స్‌తో పాటు సంబంధిత అనుభవం ఉన్న అభ్యర్థులు కూడా అర్హులేనని పేర్కొన్నారు.

**వేతన వివరాలు..** రూ.47 వేల వరకు వేతనం

అభ్యర్థుల అర్హత, నైపుణ్యం, అనుభవాన్ని బట్టి నెలకు ఆర్‌ఎం 1,700 నుంచి ఆర్‌ఎం 2,000 వరకు వేతనం లభించే అవకాశం ఉందని రాధిక తెలిపారు. భారతీయ కరెన్సీలో ఇది సుమారు రూ.40,298 నుంచి రూ.47,409 వరకు ఉంటుందని పేర్కొన్నారు. విదేశాల్లో ఉద్యోగాలు పొందేందుకు ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అభ్యర్థులు విదేశీ ఉద్యోగాల కోసం చట్టబద్ధమైన, సురక్షితమైన వలస మార్గాలనే అనుసరించాలని రాధిక సూచించారు. పూర్తి వివరాలు మరియు దరఖాస్తు ప్రక్రియ కోసం అధికారిక వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in నుపరిశీలించాలని, మరింత సమాచారం కోసం 080355 24946 నంబర్‌ను సంప్రదించాలని ఆమె తెలిపారు.

## గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఘనంగా జాతీయ స్థాయి క్రీడా పోటీలు-2026 ప్రారంభం



**ఇబ్రహీంపట్నం,సెప్టెంబర్ 10(జనంసాక్షి) :** గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్ ఇబ్రహీంపట్నంలో 'సర్దార్ తవీందర్ సింగ్ కోహ్లీ జాతీయ స్థాయి క్రీడా పోటీలు--2026' గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సంస్థ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా, వ్యవస్థాపక ఛైర్మన్ దివంగత సర్దార్ తవీందర్ సింగ్ కోహ్లీ స్మారకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.సెప్టెంబర్ 10 నుండి 12వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడోత్సవాన్ని గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ ఛైర్మన్ మరియు గురు నానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ అధికారికంగా ప్రారంభించారు.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేనేజింగ్ డైరెక్టర్ డా. హెచ్. ఎస్. సైనీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే తత్వం మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో, న్యాయబద్ధంగా ఆడాలని పిలుపునిచ్చా రు. ఈ జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుండి మొత్తం 91 జట్లు/ఎంట్రీలు పాల్గొంటున్నాయి. వాలీబాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ (బాలురు ౚ బాలికల సింగిల్స్), టేబుల్ టెన్నిస్ (బాలుర సింగిల్స్) విభాగాలలో ఈ పోటీలు జరగనున్నాయి.ఈ కార్యక్రమంలో జీఎన్‌ఐటీసీ డైరెక్టర్ డా. ఎస్. శ్రీనాథ రెడ్డి స్వాగత ప్రసంగం చేయగా, అసోసియేట్ డైరెక్టర్ డా. రిషి సయల్ ధన్యవాద సమర్పణ చేశారు. డీన్లు, విభాగాధిపతులు, ఫిజికల్ డైరెక్టర్ పి. ప్రభాకర్, కోచ్‌లు, రిఫరీలు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఏర్పుమళ్లలో ఆగాఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమం

**బొంరాస్ పేట, సెప్టెంబర్ 10(జనం సాక్షి):**చిన్నారుల ఆరోగ్యం,సంరక్షణ,విద్య మరియు సమగ్ర అభివృద్ధిపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆగాఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పుమళ్ళ గ్రామంలో గురువారం కళాజాత కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బందెయ్య మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం సంరక్షణ మరియు విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.చిన్న వయస్సులోనే పిల్లలకు ప్రేమ,ఆప్యాయత,మంచి సంభాషణ,ఆటలు మరియు సరైన సంరక్షణ అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు మంచి పునాది వేయవచ్చని తెలిపారు.గ్రామంలో ఇలాంటి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్ మాట్లాడుతూ పిల్లల సమగ్ర అభివృద్ధిలో తల్లిదండ్రులతో పాటు సమాజం కూడా బాధ్యత తీసుకోవాలని అన్నారు.ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ ప్రాముఖ్యతను ప్రతి తల్లిదండ్రి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఆగాఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ (జుజణ) గురించి వివరించారు.చిన్నారుల తొలి సంవత్సరాల్లో వారికి అందించే ప్రేమ, ఆప్యాయత,సంభాషణ, ఆటలు,నేర్చుకునే అవకాశాలు వారి శారీరక, మానసిక, సామాజిక మరియు భావోద్వేగ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని వివరించారు.కళాజాత కార్యక్రమంలో పాటలు, నాటికలు మరియు వివిధ కళారూపాల ద్వారా చిన్నారుల ఆరోగ్యం, సంరక్షణ, విద్య మరియు సమగ్ర అభివృద్ధికి సంబంధించిన సందేశాలను ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్థులు ఆసక్తిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో ఆగాఖాన్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సుమలత, మమత, సంపత్, శ్రీనివాస్, సునీత, నరేష్, అంగన్వాడీ టీచర్లు సుజాత గౌస్యాబేగం ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ సామగ్రి చోరీ కేసులో నిందుతుడు అరెస్ట్

**శంషాబాద్, సెప్టెంబర్10(జనంసాక్షి) :** సెంట్రింగ్ సామగ్రి చోరీ కేసులో నిందుతుడిని శంషాబాద్ పోలీసులు 24గంటల లోపే అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షాహీన్‌నగర్, బార్కాస్‌కు చెందిన షేక్ సోహైల్ (26)ను అరెస్ట్ చేసి, మేకలబండ తండాలో చోరీకి గురైన సెంట్రింగ్ సామగ్రి, ఐరన్ కట్టింగ్ మెషిన్, ఐరన్ డాగ్స్, సుత్తులు తదితర రూ.20 వేల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సీసీటివి ఫుటేజులు, ఇతర ఆధారాలతో నిందితుడిని గుర్తించిన పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయ రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని చేవెళ్ల, ఫ్యూచర్ సిటీ ఏసీపీ అభినందించారు.

### హిందూ ఉత్సవ కేంద్ర సమితి నూతన కార్యవర్గానికి.చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అభినందనలు.

**తాండూరు సెప్టెంబర్ 10(జనంసాక్షి)** హిందూ ఉత్సవ కేంద్ర సమితి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు గురువారం హైదరాబాద్ లోని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి బిర్కడ్ రఘు ఆధ్వర్యంలో జరిగిన ఈ కలయికలో నూతన కమిటీ సభ్యులకు మహేందర్ రెడ్డి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ, సనాతన సంప్రదాయాల పరిరక్షణ కోసం సమితి చేస్తున్న కృషి అభినందనీయం. సమితి సభ్యులందరూ కలిసికట్టుగా ఉండి రాబోయే వినాయక ఉత్సవాలను, ఇతర హిందూ పండుగలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సిములు, హిందూ ఉత్సవ కేంద్ర సమితి గౌరవ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, కోశాధికారి అంతారం కిరణ్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, అధికార ప్రతినిధి పర్యాద రామ కృష్ణ, ప్రచార కార్యదర్శులు, సాంస్కృతిక కార్యదర్శులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు, సోషల్ మీడియా కన్వీనర్లు పాల్గొన్నారు.

# ప్రమాదాల అంచున జుంటుపల్లి



సీతారామచంద్రుల వారి ఆలయము ఇలాంటి అరుదైన టూరిజం సిరిసంపదలు ఉన్న ఈ గ్రామం, పాలకుల దార్శనికత లోపించడం వల్లే నేడు వినాశనానికి దగ్గరవుతోంది.

**నాయకుల పంతాలు.. వృథాగా పోతున్న నిధులు**

జుంటుపల్లి దుస్థితికి ప్రధాన కారణం నిధుల కొరత కాదు... నాయకుల మధ్య ఉన్న రాజకీయ వైషమ్యాలు, వ్యక్తిగత పంతాలు. గ్రామాభివృద్ధి కోసం, రోడ్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం నుంచి ఉపాధి హామీ నిధులు పెద్ద ఎత్తున విడుదలైనప్పటికీ, వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. స్థానిక నాయకుల మధ్య నెలకొన్న తీవ్ర పోటీతత్వం, 'నేను కాకపోతే నీవు చేయకూడదు' అనే అహంకార పూరిత వైఖరి వల్ల ఆ నిధులు కాస్తా మూలనపడ్డాయి. ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించే క్రమంలో ఊరి ప్రయోజనాలను, ప్రాజెక్టు రక్షణను, టూరిజం అభివృద్ధిని పక్కనబెట్టడం ఎంతవరకు న్యాయం? నాయకుల స్వార్థ రాజకీయాలకు పల్లె ప్రగతి బలికావాలా?

**ఎమ్మెల్యే గారూ కదిలిరండి**

స్థానిక నాయకుల వైఫల్యాలు, పంతాల వల్ల గ్రామం నాశనమవుతుంటే చూస్తూ ఊరుకోలేక ఇక్కడి ప్రజలు ఇప్పుడు ఆశాకిరణంగా తమ నియోజకవర్గ ఎమ్మెల్యే గారి వైపు చూస్తున్నారు. కింది స్థాయి నాయకుల గ్రూపు రాజకీయాల వల్ల ఈ చారిత్రక పల్లెకు మోక్షం లభించదని గ్రహించిన ప్రజలు, ఎమ్మెల్యే స్వయంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, జుంటుపల్లిని తన 'దత్తత గ్రామంగా' స్వీకరించి అభివృద్ధి పనులు చేయాలని ముక్తకంఠంతో కోరుకుంటున్నారు. ఎమ్మెల్యే నేరుగా రంగంలోకి దిగి, నిధుల మంజూరు చేయించి, పనులను పర్యవేక్షిస్తేనే ఇక్కడి రాజకీయ





ఆటంకాలు తొలగిపోతాయని ప్రజలు బలంగా నమ్ముతున్నారు. దత్తత గ్రామంగా మారితేనే జుంటుపల్లి ప్రాజెక్టుకు, రామాలయానికి, ఇక్కడి రోడ్లకు మహర్దశ పడుతుందని ఆశిస్తున్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గానికి ఇంత దగ్గరగా ఉన్న గ్రామం ఇలా వెనకబడి పోవడం ప్రభుత్వ ప్రతిష్టకు కూడా మంచిది కాదని గుర్తుచేస్తున్నారు.



# వెట్టిచాకరి సంకెళ్లను తెంచిన తిరుగుబాటు బావుట ఐలమ్మ

- సిపిఐ మండల కార్యదర్శి కొమ్మగళ్ల రాజు.
- బానిసత్వానికి చిరునామాగా మారిన గడీల దొరతానంపై సమర శంఖం పూరించిన ధీర వివనీత.

**కందుకూరు సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** బానిసత్వానికి చిరునామాగా మారిన గడీల దొరతనంపై సమర శంఖం పూరించి, వెట్టిచ్చాకిరి సంకెళ్ళనుతెంచిన తిరిగుబాటు బావుట, "నా నేల.. నా పంట.. నన్ను అడ్డుకునేదెవడు?" అని నిజాం నిరంకుశత్వాన్ని సవాల్ చేసిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట పటిమ తెలంగాణ చరిత్రలోనే అజరామరమని సీపీఐ మండల కార్యదర్శి కొమ్మగళ్ళ రాజుపేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరనారి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా కందుకూరు మండల కేంద్రంలో గురువారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఐలమ్మ చేసిన వీరోచిత పోరాటం నేటికీ శ్రామిక వర్గానికి స్ఫూర్తిప్రదాతగా నిలుస్తోందన్నారు. నాటి భూస్వామ్య వ్యవస్థను, దొరల అకృత్యాలను ఎదురొడ్డి నిలిచిన



ఆమె ధైర్యం చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. నేటికీ పీడిత ప్రజలపై, కార్మిక వర్గంపై సాగుతున్న శ్రమదోపిడీకి వ్యతిరేకంగా,రాజీలేని పోరాటాలు చేయడమే ఆ వీరనారికి ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ప్రజాహక్కుల సాధన కోసం సీపీఐ నిరంతర పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులు అర్పించారు.

# రైతులకు ఆన్‌లైన్ సేవలు మరింత చేరువ

- సురంగల్ పీఏసీఎస్‌లో కామన్ సర్వీసింగ్ సెంటర్ ప్రారంభం
- రుణాలను సకాలంలో చెల్లించి, స్వల్పకాలిక రుణాలను రెన్యువల్ చేసుకోవాలి
- బంగారంపై రుణ సదుపాయం అందుబాటులో ఉంది



**మొయినాబాద్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** మొయినాబాద్ మండలంలోని సురంగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ప్రధాన కార్యాలయంలో కామన్ సర్వీసింగ్ సెంటర్ (సీఎస్‌సీ)ను సంఘం అధ్యక్షుడు మందడి చంద్రారెడ్డి ప్రారంభించారు. రైతులకు వివిధ రకాల ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సీఎస్‌సీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా సంఘం చైర్మన్ మాట్లాడుతూ రైతులు సంఘానికి సంబంధించిన దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించాలని, స్వల్పకాలిక రుణాలను గడువులోగా రెన్యువల్ చేసుకోవాలని కోరారు. అదేవిధంగా సంఘం ద్వారా బంగారంపై రుణ సదుపాయం కూడా అందిస్తున్నామని, అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు దర్గ మహేందర్, డైరెక్టర్లు కడుమూరి నరసింహారెడ్డి, కాసాల రాంరెడ్డి, ఉప్పరి శ్రీనివాస్, సామా అనిత, చిడిగిద్ద భూపాల్‌రెడ్డి, పట్లోళ్ల రాఘవేందర్‌రెడ్డి, పట్లోళ్ల నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు యాదయ్య, నడిమింటి గంగమ్మ, పాటి జగన్మోహన్‌రెడ్డి, సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) బొలిగిద్ద జగదీష్, సిబ్బంది ఏ. మాణిక్‌రెడ్డి, ఎం. చెన్నారెడ్డి, ఎస్. శ్రీనివాస్, బి. వెంకటయ్య, వి. శివకుమార్ చారి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# కందుకూరు మినీ స్టేడియంలో ముగిసిన మహేశ్వరం జోన్ క్రికెట్ టోర్నమెంట్

**కందుకూరు సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** కందుకూరు ఎక్స్ రోడ్డులోని మినీ స్టేడియం ప్రాంగణంలో గత మూడు రోజులుగా ఎంతో ఉత్సాహభరితంగా నిర్వహించిన స్కూల్ గేమ్స్ పెడరేషన్ (బా+బా) మహేశ్వరం జోన్ అండర్-14 క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో విజయవంతంగా ముగిసింది. ఈ క్రీడా పోటీల్లో జోన్ పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి మొత్తం 20 జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నాయి. తీవ్ర పోటీ నడుమ సాగిన ఫైనల్ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరచిన శ్రీ చైతన్య స్కూల్ (కందుకూరు బ్రాంచ్) ప్రథమ బహుమతి (విజేతగా) కైవసం చేసుకోగా, ప్రతిభ చాటిన మహేశ్వరం ట్రైబల్ స్కూల్ ద్వితీయ బహుమతి (రన్నరప్)తో సరిపెట్టుకుంది. ముగింపు వేడుకలకు పలువురు ప్రజాప్రతినిధులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వరం జోన్ సెక్రటరీ అబ్దుల్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి



టోర్నమెంట్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు, శిక్షకులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఏనుగు జంగారెడ్డి,మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయక్,నేదునూర్,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ,నేదునూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శర్మ, కొత్తగూడ సర్పంచ్ సురేందర్,రఘుబాబు,యువజన నాయకులు అజీజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్టియు మండల అధ్యక్షుడిగా నీలకంఠ రాథోడ్



మర్పల్లి సెప్టెంబర్ 10 (జనం సాక్షి) పిఆర్టియు మర్పల్లి మండల అధ్యక్షుడిగా మర్పల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో పనిచేస్తున్న నీలకంఠ రాథోడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మోహన్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ వెంకటయ్య, గౌరవ అధ్యక్షులుగా అనంతయ్య, ఎండి అలీముద్దీన్, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా స్వరూప, ఉపాధ్యక్షులుగా అనురాధ, కార్యదర్శులుగా విజయకుమార్ లను ఏకగ్రీవంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పిఆర్టియు సంఘం పనిచేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని సిపిఎస్ రద్దు పిఆర్సి అమలు హెల్త్ కార్డు తదితర విషయాల్లో జాప్యం తగదని వారన్నారు. మాపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన జిల్లా సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, అంజలయ్య, లాలయ్య, కేదార్నాథ్, అనంతయ్య, అనంత్, మోహన్ రెడ్డి, విజయకుమార్, సంగమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మకు ఘన నివాళి



ఎల్బీనగర్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా టీపీసీసీ జనరల్ సెక్రటరీ పృథ్వీ చౌదరి ఘన నివాళులర్పించారు. భూస్వామ్య దోపిడీ, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఆలయ బోర్డు డైరెక్టర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బుడ్డ సత్యనారాయణ, అశోక్ గౌడ్, పోచబోయిన సురేష్ యాదవ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి బాలకృష్ణ యాదవ్, వేములయ గౌడ్, కోప్పుల వెంకటరెడ్డి, చెర్ల రమేష్, ఏరా శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## టియుడబ్ల్యూజెహెచ్ 143 మండల శాఖ అధ్యక్షునిగా డి అశోక్

### ప్రధాన కార్యదర్శిగా గుజ్జరి మహేందర్ ఏకగ్రీవ ఎన్నిక

మోమిన్‌పేట, సెప్టెంబర్ 10, (జనం సాక్షి) : టియుడబ్ల్యూజేహెచ్ 143 మోమిన్‌పేట మండల శాఖ అధ్యక్షునిగా డి అశోక్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, జర్నలిస్టుల ఐక్యతకు మరో ముందడుగు పడింది. మండలంలోని విలేకరులు సమావేశమై విలేకరుల కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడిగా డి .అశోక్, ప్రధాన కార్యదర్శిగా గుజ్జరి మహేందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ నిజాన్ని నిర్భయంగా, నిష్పక్షపాతంగా ప్రజల ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా నూతన కమిటీ పనిచేయాలని నిర్ణయించింది.మండలంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణకు, జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేయడానికి సమష్టిగా కృషి చేయనున్నట్లు నూతన కమిటీ నాయకులు తెలిపారు.

ప్రజా సమస్యలే ఎజెండాగా.. ప్రజల పక్షమే లక్ష్యంగా మోమిన్‌పేట్ మండలంలో జర్నలిజాన్ని మరింత బలోపేతం చేస్తామని వారు పేర్కొన్నారు.నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు దాసరి అశోక్, ప్రధాన కార్యదర్శి గుజ్జరి మహేందర్‌లకు పలువురు జర్నలిస్టులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# మట్టి వినాయకులతో కాలుష్యానికి చెక్

- పీఓపీ విగ్రహాలకు బదులు మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలి
- చెరువుల పరిరక్షణకు హైడ్రా నిరంతరం కృషి
- జన్-జీ యువత ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలి
- హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్



**షేక్‌పేట్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** రాయదుర్గంలోని మలకం చెరువు వాకర్స్ అసోసియేషన్, తెలంగాణ యువత ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ యువత రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్మడి సతీష్, మలకంచెరువు వాకర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మల్లికార్జున్ నరుకుడుబిందెల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్, ఐపీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ చెరువుల పరిరక్షణ కోసం హైడ్రా అనేక సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగుతోందన్నారు. ప్రజల ఆస్తులైన వేలాది ఎకరాల కబ్జా భూములను హైడ్రా స్వాధీనం చేసుకుని పరిరక్షణ చర్యలు చేపట్టిందని తెలిపారు. ఎన్ని కేసులు ఎదురైనా చెరువుల పరిరక్షణ విషయంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. కబ్జాదారులు, భూకబ్జాదారులపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని అన్నారు. వినాయక చవితి సందర్భంగా పీఓపీ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించాలని, సింథటిక్ రంగులకు బదులు సహజ రంగులను ప్రోత్సహించాలని సూచించారు. తద్వారా నీటి కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. జన్-జీ యువత సమాజంలోని ప్రధాన సమస్యలపై స్పందిస్తూ ప్రకృతి పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్ తరాలకు సురక్షితమైన జీవనాన్ని అందించగలమన్నారు.

తెలంగాణ యువత రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్మడి సతీష్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో తన వంతు బాధ్యతగా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తున్నానని, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. మలకంచెరువు వాకర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మల్లికార్జున్ నరుకుడుబిందెల మాట్లాడుతూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ చేపడుతున్న చెరువుల పరిరక్షణ చర్యలు భవిష్యత్ తరాలకు ఎంతో ప్రయోజనకరమన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను వినియోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. పార్క్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దగోని సతీష్ గౌడ్ మాట్లాడుతూ గాలి, నీరు, భూమి స్వచ్ఛంగా ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని అన్నారు.

కార్యక్రమంలో పార్క్ అసోసియేషన్ సభ్యులు రమణారెడ్డి, రాజేష్, మురళి, బాబ్జి, జ్ఞానేశ్వర్, షీప్స్ అండ్ గోట్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్, డాక్టర్ ఎంకే రాజేష్, ప్రమోద్ కుమార్, రాజేశం, భాస్కర్ గౌడ్, రాజశేఖర్, భాస్కర్ పటేల్, శ్రీకాంత్, నిత్యారెడ్డి, కన్నాల సురేష్, రాజ్‌కుమార్, హైడ్రా సిబ్బంది, స్థానిక ప్రజలు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం



**చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు**

**తలకొండపల్లి సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని గట్టు ఇప్పలపల్లి సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్ అన్నారు.మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీర వనిత చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని రజక సంఘం అధ్యక్షులు దశరథం, ఉపాధ్యక్షులు సాయిలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ కూడలిలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ రజక సంఘం సభ్యులు కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్,రజక సంఘం నాయకులు మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలు,అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె చూపిన ధైర్యం,పట్టుదల,పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దేరంగుల అనిత విజయ్,వార్డు సభ్యులు రేణు రెడ్డి,శెట్టి రాజశేఖర్,ముకురాల అశోక్ గౌడ్,కొండమోని రాజశేఖర్,ఎంగి వెంకటమ్మ రాజు,గ్రామ నాయకులు మట్ట అంజయ్య,జంగయ్య,పవన్ వాల్మీకి,జగన్,నరేందర్ గౌడ్,శివ గౌడ్,దేశమోని రాములు,శ్రీను,ఊరుకొండ రామచేంద్రి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రుల ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



**ఫ్యూచర్ సిటీ మహేశ్వరం ఏసిపి జానకి రెడ్డి**

**తలకొండపల్లి సెప్టెంబర్10 (జనంసాక్షి):** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు,భక్తులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని మహేశ్వరం ఏసీపీ జానకి రెడ్డి సూచించారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని దేవకి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో గురువారం తలకొండపల్లి ఎస్సై కె.శేఖర్ ఆధ్వర్యంలో గణేష్ మండపాల నిర్వాహకులు,భక్తులకు సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహేశ్వరం ఏసిపి జానకిరెడ్డి మాట్లాడుతూ..గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు.గణేష్ నవరాత్రుల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, మండపాల వద్ద విద్యుత్ జాగ్రత్తలు,అగ్నిమాపక ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. చిన్నారులు విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండేటట్లు జాగ్రత్తలు వహించాలని సూచించారు.మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

**పగలు..రాత్రి పోలీసుల నిఘా..**

గణేష్ మండపాల వద్ద భక్తులు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పగలు,రాత్రి బీట్ నిర్వహించడంతో పాటు నిరంతరం పెట్రోలింగ్ చేపడతామని తెలిపారు.యువత అత్యుత్సాహానికి పోకుండా బాధ్యతగా వ్యవహరించాలని,శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

**భక్తి పేరుతో నిబంధనలు అతిక్రమించొద్దు**

గణేష్ ఉత్సవాలు భక్తి, ఐక్యతకు ప్రతీకగా నిలవాలని పోలీసులు కోరుతున్నారు.ఉత్సవాల పేరుతో డీజేలు,అధిక శబ్దాలు,ట్రాఫిక్కు అంతరాయం కలిగించే విధంగా మండపాల ఏర్పాటు వంటి అంశాల్లో నిబంధనలు పాటించాలని సూచించారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని,నిర్వాహకులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఏసిపి జానకి రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో కడ్తాల్ ఇన్స్పెక్టర్ సైదారెడ్డి,పోలీసులు,మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- సెప్టెంబర్ 12న మేడ్చల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్
- జీనోమ్ వ్యాలీ సీఐ గొపగాని గురువయ్య గౌడ్



**శామీర్ పేట్,సెప్టెంబర్ 10(జనం సాక్షి) :** మేడ్చల్ కోర్టు ప్రాంగణంలో ఈ నెల 12వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుంది. లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాల సమ్మతితో వివిధ రకాల పెండింగ్ కేసులు మరియు రాజీ పడదగిన కేసులను సులభంగా, త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంది. కోర్టుల చుట్టూ తిరగకుండా సమయం, ఖర్చు ఆదా చేసుకుంటూ కేసులను పరిష్కరించుకునేందుకు ఇది ఒక మంచి అవకాశమని జీనోమ్ వ్యాలీ సీఐ గురువయ్య గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు, కక్షిదారులు మరియు సంబంధిత పక్షాలు తమ కేసులకు సంబంధించి జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. రాజీ పడదగిన కేసుల్లో ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో ముందుకు వచ్చి, సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని సీఐ గోపగాని గురువయ్య గౌడ్, కక్షీ దారులను కోరారు.



# అల్లాపూర్‌లో చాయ్ ముచ్చట్లు...

**గ్రామస్తుల కష్టసుఖాలు తెలుసుకున్న కంజర్ల విజయలక్ష్మి.**

**తాండూరు సెప్టెంబర్ 10(జనంసాక్షి)** తాండూర్ మండలంలోని అల్లాపూర్ గ్రామంలో కంజర్ల విజయలక్ష్మి గ్రామస్తులతో కలిసి చాయ్ ముచ్చట కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో స్థానిక పరిస్థితులు ఎలా ఉన్నాయి, వ్యవసాయం ఎలా సాగుతోంది, కూలీల పరిస్థితి ఏంటి అని తెలుసుకోవడానికి ఇక్కడికి వచ్చాను. మీ అందరి యోగక్షేమాలు తెలుసుకోవడమే నా ముఖ్య ఉద్దేశమని అన్నారు.గ్రామంలోని యువత, మహిళలు, గ్రామ పెద్దలతో ఆమె ఆప్యాయంగా మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఈ చాయ్ ముచ్చట కార్యక్రమంలో గ్రామ యువత, మహిళలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ



**రాజేంద్రనగర్, సెప్టెంబర్7(జనంసాక్షి) :** ప్రజలు వినాయక చవితిని ప్రశాంతంగా, పర్యావరణహితంగా నిర్వహించాలని నర్సింగ్ సర్కిల్ బీసీ లక్ష్మారెడ్డి తెలిపారు.రానున్న వినాయక చవితి సందర్భంగా నార్సింగ్ సర్కిల్45 పరిధిలో ఉచితంగా పంపిణీ చేసేందుకు 1,200 పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను అందుబాటులో ఉంచామన్నారు. ఆయన ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయంలో విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు వినాయక చవితిని ప్రశాంతంగా, పర్యావరణహితంగా నిర్వహించాలని సూచించారు. ఆసక్తి గల భక్తులు సర్కిల్ కార్యాలయంలో విగ్రహాలను పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీధర్, శ్రీనివాస్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఘనంగా బజారు దీక్షిత జయంతి వేడుకలు వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం

**ఇబ్రహీంపట్నం,సెప్టెంబర్ 10(జనం సాక్షి )** ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు, బీసీ సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బజారు బిక్షపతి కుమార్తె బజారు దీక్షిత 13వ జయంతి మహోత్సవాలను గురువారం వినోబానగర్‌లోని 'మాతా పితా సేవా సదనంలో' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గతేడాది కాంపౌండ్ వాల్ కూలిన ప్రమాదంలో దీక్షిత అకాల మరణం చెందిన సంగతి తెలిసిందే. చిన్న వయసులోనే క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచి, అనేక బహుమతులు సాధించిన దీక్షిత జ్ఞాపకాలను తలచుకుని కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. భౌతికంగా తమ మధ్య లేకపోయినా, సేవా కార్యక్రమాల ద్వారా ఆమె జ్ఞాపకాలను సజీవంగా ఉంచుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు గణం నర్సింహ కురుమ మాట్లాడుతూ.. చిన్న వయసులోనే క్రీడల్లో రాణించిన దీక్షిత అకాల మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు చిన్నం రఘుపతి కురుమ, నోముల జంగయ్య, శ్రీనివాస్, నవదీప్ తదితరులు పాల్గొని దీక్షిత చిత్రపటానికి నివాళులర్పించారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి

**మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్**



**బొంరాస్ పేట, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్ అన్నారు.గురువారం మండల పరిధిలోని ఏర్పుమళ్ళ ప్రాథమికోన్నత పాఠశాలలో సర్పంచ్ బందేయ్య,ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్ తో కలిసి విద్యార్థులకు రెండవ విడత ఏకరూప దుస్తులు,సాక్స్ అందజేశారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సాధించి విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అహర్నిశలు పనిచేస్తున్నాడని, ప్రభుత్వ పాఠశాలలో చదివిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇటీవల కోడంగల్లో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవంలో తెలియజేయడం జరిగిందన్నారు. అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చదివించడం ద్వారా నాణ్యమైన మెరుగైన విద్యతో పాటు, ఉదయం పూట అల్పాహారం, మధ్యాహ్నం మధ్యాహ్నం భోజనం అందిస్తున్నట్లు సర్పంచ్ బందేయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సర్దార్ ,ప్రశాంత్, గ్రామస్తులు చిన్న నర్సింలు, ఆంజనేయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మల్కాజ్గిరి కార్పొరేషన్ జోనల్ కమీషనర్ సంచిత్ గంగ్వార్ కు శుభాకాంక్షలు తెల్పిన హైమారెడ్డి



**శామీర్ పేట్, సెప్టెంబర్ 10(జనంసాక్షి) :** మహిళా శక్తి మై వాయిస్ సంఘం ఆధ్వర్యంలో మీ సమస్య మా పరిష్కారం కార్యక్రమంలో భాగంగా శామీర్ పేట్ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి రోడ్డు సమస్యలపై మల్కాజిగిరి కార్పొరేషన్ జోనల్ కమిషనర్ సంచిత్‌బి గంగ్వార్‌కి గ్రామస్తులతో కలిసి మౌళిక వసతులపైన ఇచ్చినటువంటి వినతి పత్రానికి స్పందించి కమీషనర్ వారి బృందం కలిసి శామీర్ పేట్ లో పర్యటన చేసి రోడ్లు మరియు డ్రైనేజి సమస్యలను గ్రామస్తుల ఆధ్వర్యంలో పరిశీలించి మంజూరు చేసి గ్రామస్తుల కష్టాలను తీర్చారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ని షామీర్ పేట్ గ్రామస్తులతో కలసి శాలువాతో సత్కారించి కృతజ్ఞతలు తెలియజేశారు.షామీర్ పేట్ డివిజన్ పరిధిలోని పోతాయిపల్లి గ్రామంలో రోడ్లు డ్రైనేజీ సమస్యల గురించి వినతి పత్రం అందజేశారు.మీ సమస్య మా పరిష్కారం కార్య క్రమం ద్వారా ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన పథకంను మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రజలందరికి ఉచితంగా అందిస్తున్నట్లు మహిళా శక్తి మై వాయిస్ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు హైమారెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో అంబటి రమేష్, స్థానికులు చంద్ర శేఖర్, మచ్చేందర్, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లుభక్తుల భద్రతకు ప్రాధాన్యం

**కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి.**

**ఎంఎంసీలో సమన్వయ సమావేశం**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను సురక్షితంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఎంఎంసీ ప్రధాన కార్యాలయంలో భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, అంబులెన్సులు, అగ్నిమాపక పరికరాలు, లైటింగ్, కంట్రోల్ రూమ్‌లు, తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు, ట్రాఫిక్ శాఖలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ భద్రత, అత్యవసర వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం అనంతరం వ్యర్థాలను వెంటనే తొలగించాలని, చిన్న విగ్రహాల నిమజ్జనానికి కృత్రిమ బేబీ పాండ్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.

ముఖ్య ఆదేశాలు

నిమజ్జన ప్రాంతాల్లో పూర్తి స్థాయి భద్రతా ఏర్పాట్లు

క్రేన్లు, అంబులెన్సులు, ఫైర్ సేఫ్టీ పరికరాల ఏర్పాటు

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక బృందాలు

విద్యుత్, అగ్నిమాపక భద్రతా ప్రమాణాల అమలు

చిన్న విగ్రహాలకు కృత్రిమ బేబీ పాండ్ల వినియోగ ప్రోత్సాహం

సమావేశంలో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి, జోనల్ కమిషనర్లు, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యం

**సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన : రామిడి స్వప్న విజయ్‌రెడ్డి**





**కీసర, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి అన్నారు. కీసర సర్కిల్ పరిధిలోని కీసర డివిజన్ శ్రీ భవాని రామలింగేశ్వర కాలనీ, సుభాష్‌నగర్ కాలనీల్లో పలు అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి పాల్గొన్నారుఅనంతరం ఆమె మాట్లాడుతూ..కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ వెంకటేశ్వర కాలనీ గణేశ్ ఉత్సవాలకు ముప్పా రామారావు సహాయం

**కీసర, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):**శ్రీ వెంకటేశ్వర కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక చవితి పూజకు దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావును కాలనీ ప్రతినిధులు ఆహ్వానించారు.ఈ సందర్భంగా గణేశ్ ఉత్సవాల విజయవంతమైన నిర్వహణ కోసం ముప్పా రామారావు రూ.5,116 విరాళం అందజేశారు. కాలనీ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరగాలని ఆకాంక్షించారు.

**యువ చెస్ క్రీడాకారుడికి ముప్పా రామారావు ఆర్థిక సహాయం**

దేశంలోని ముంబై, చెన్నై, బెంగళూరు, మంగళూరు, కోల్‌కతా నగరాల్లో నిర్వహించిన చెస్ పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ కనబరుస్తున్న యువ చెస్ క్రీడాకారుడు బోయిన అనిల్‌ను ముప్పా రామారావు అభినందించారు. ఈ పోటీల్లో అనిల్ రెండు బహుమతులు సాధించి, తన ప్రతిభను చాటుకున్నాడు. రాయ్ చెస్ అకాడమీ కోచ్ కె.రాజశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న అనిల్ త్వరలో ఢిల్లీలో జరగనున్న చెస్ పోటీల్లో పాల్గొననున్న నేపథ్యంలో అతడిని ప్రోత్సహించేందుకు ముప్పా రామారావు రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. యువ క్రీడాకారులు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.




# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా రామచంద్రయ్య

- **భౌతిక శాస్త్ర బోధనలో వినూత్న పద్ధతులకు గుర్తింపుడిజిటల్ లెర్నింగ్,**
- **అటల్ టింకరింగ్ ల్యాబ్ వినియోగంలో విశేష కృషి**

**కీసర, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ భౌతిక శాస్త్ర బోధనను ప్రయోగాత్మకంగా, ఆసక్తికరం గా మార్చిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం లోని చీర్యాల్ జడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) రామచంద్రయ్య జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రయోగశాల కార్యకలాపాలు, డిజిటల్ బోధన, అటల్ టింకరింగ్ ల్యాబ్ కృత్యాల్లో భాగస్వాములను చేస్తూ అందించిన సేవలకు ఈ పురస్కారం దక్కింది.

విద్యార్థులు భౌతిక శాస్త్రాన్ని సులభంగా అర్థం చేసుకోవడంతో పాటు, ఆసక్తిగా నేర్చుకునేలా రామచంద్రయ్య ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటు న్నారు. పాఠ్యాంశాలను కేవలం తరగతి గదికే పరిమితం చేయకుండా ప్రయోగశాలలో ప్రత్యక్ష కృత్యాల ద్వారా బోధిస్తున్నారు. “ఖాన్ అకాడమీ” వంటి డిజిటల్ వేదికలను వినియోగించుకునేలా విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఆధునిక బోధనా విధానాలను అమలు చేస్తున్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో విద్యార్థులతో వినూత్న కార్యక్రమాలు నిర్వహించి సృజనాత్మకత, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందిస్తున్నారు.

**విద్యారంగంలో ఆయన చేసిన సేవలు విశేషమైనవి..**

2013లో నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు గణితం, భౌతిక శాస్త్రం, ఈవీఎస్, జీవశాస్త్రం పాఠ్యపుస్తకాలను ఇంగ్లీష్ నుంచి హిందీ మాధ్యమంలోకి అనువదించి విద్యా విస్తరణకు తోడ్పడ్డారు. జిల్లా రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తూ జిల్లాలోని భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.



2023--24 విద్యాసంవత్సరంలో టాటా బిల్డింగ్ ఇండియా స్కూల్ ఎస్సే పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సాయిప్రియకు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సత్కారం లభించడంలో రామచంద్రయ్య మార్గదర్శకత్వం కీలకంగా నిలిచింది. విద్యార్థుల ప్రతిభను వెలికితీసి ఉన్నత స్థాయికి చేర్చడంలో ఆయన కృషి ప్రశంసనీయమని సహచర ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

డీఎస్సీ-2000 ద్వారా ఎస్‌జీటీగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన రామచంద్రయ్య శంషాబాద్ మండలంలోని పాఠశాలల్లో సేవలందించారు. అనంతరం 2005 నవంబర్‌లో పదోన్నతిపై మొయినాబాద్ మండలం చిన్నమంగళారం జడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)గా బాధ్యతలు స్వీకరించారు. 2009 నుంచి 2018 వరకు జడ్పీహెచ్ఎస్ రాంపల్లిలో, 2018 నుంచి 2022 వరకు జడ్పీహెచ్ఎస్ మేడిపల్లిలో పనిచేశారు. 2022 నుంచి ప్రస్తుతం జడ్పీహెచ్ఎస్ చీర్యాలలో విధులు



నిర్వహిస్తున్నారు. రామచంద్రయ్యకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

అవార్డు మరింత బాధ్యత పెంచింది

**విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందిస్తా**

**- ఉత్తమ ఉపాధ్యాయుడు రామచంద్రయ్య**

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందిస్తూ, ప్రయోగాత్మక బోధనకు మరింత ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని రామచంద్రయ్య పేర్కొన్నారు.

